## క్లుప్తంగా

### నేటి నుంచి పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

**తగరపువలస:** చిట్టివలస సబ్ పోస్టాఫీసులో బుధవారం నుంచి జాతీయ జెండాలు విక్రయించనున్నట్టు పోస్ట్‌మాస్టర్ బోని చంద్రశేఖర్ తెలిపారు. ఈ పోస్టాఫీసు పరిధిలోని 21 గ్రామాలకు వంద వంతున, చిట్టివలస సబ్ పోస్టాఫీసులో 500 కలిపి 2600 జెండాలు విక్రయిస్తామన్నారు. అవసరమైన వారు రూ.25 చెల్లించి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9397881566లో సంప్రదించాలని కోరారు.

### ముఠా కార్మికుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

**మధురవాడ:** విశాఖలో ఈ నెల 12, 13న జరిగే ఏఐటీయూసీ జిల్లా మహా సభల జయప్రదానికి మంగళవారం నాయకులు, కార్మికులు సంయుక్తంగా మధురవాడలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు మాట్లాడుతూ 12న ఉదయం 10 గంటలకు సరస్వతీ పార్కు నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని చెప్పారు. ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, సర్వీసు బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అంతా ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేస్త్రి ముద్దాడ బంగారయ్య, అప్పలరెడ్డి, కృష్ణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరికాయలతో సుత్తమ్మతల్లికి అలంకరణ



**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో సుత్తమ్మతల్లిని మంగళవారం రాత్రి కొబ్బరికాయలతో అలంకరించారు. బుధవారం ఈ అలంకరణతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించిన సుత్తమ్మతల్లి ఆలయం, సుత్తమ్మ తల్లి భవాని పీఠం ప్రతినిధులు మాట్లాడారు.

### తుఫాన్ షెల్టర్ తొలగింపు ప్రారంభం



పాండ్రంగిలో షెల్టర్‌ను తొలగిస్తున్న దృశ్యం

**పద్మనాభం:** మండలంలోని పాండ్రంగిలో శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ షెల్టర్ తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ షెల్టర్ ఐదేళ్ల నుంచి శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. పెచ్చులూడిపోయి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో షెల్టర్‌ను అనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, స్థానిక నివాసులు, రోడ్డు పైనుంచి రాకపోకలు సాగించే ప్రజలు భయాందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో తుఫాన్ షెల్టర్‌ను మూడు రోజుల నుంచి అధికారులు తొలగిస్తున్నారు.

### మొదటి రోజు నామినేషన్లు నిల్

**పద్మనాభం:** మండలంలోని మూడు పంచాయతీల్లో మూడు వార్డు మెంబర్లకు ఈ నెల 19న నిర్వహించనున్న ఎన్నికలో భాగంగా మొదటి రోజైన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ నెల పది వరకు నామినేషన్లు వేసుకోవచ్చు. రెడ్డిపల్లి పంచాయతీ తొమ్మిదో వార్డు, చిన్నాపురం రెండో వార్డు, బాందేవపురం పదో వార్డు మెంబర్లకు ఎన్నిక నిర్వహించనున్నారు.



# జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**కొమ్మాది:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.

జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రామాలయం వీధి, ముబారక్ కాలనీ, గొల్లల ఎండాడ ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడి సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తూ దేశం మొత్తం ఆంధ్ర రాష్ట్రాన్ని చూసే విధంగా జగనన్న పాలన కొనసాగుతోందని కొనియాడారు. పేదలకు ఇళ్లు, చేయూత, ఆసరా, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలు అందించి పేదలకు భరోసా కలిగిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారని కొనియాడారు.

**కుట్రలు, మోసాలుకు కేరాఫ్ చంద్రబాబు**

అన్నదాతల రుణాలు, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు మాఫీ చేస్తానని గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అందరినీ మోసం చేశారని, కుట్రలకు, మోసాలకు కేరాఫ్‌గా నిలిచే చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జనం జగనన్నకే జైజైలు పలకడం ఖాయమని అన్నారు.

కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ 7, 8వ వార్డుల అధ్యక్షులు పోతిన శ్రీనివాస్, గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, బుజ్జి, అప్పలరాజు, సీరపు వంశీకృష్ణ, భాగం సుధాకర్, జయబాబు, దువ్వి వాసు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ఓటర్ల జాబితా పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి

**భీమునిపట్నం:** భీమిలి పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన ఈ నెల 21లో పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి సూచించారు. మంగళవారం బూత్‌లెవల్ అధికారులు(బీఎస్ఓ), వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బీఎల్‌వో తన పోలింగ్ బూత్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడా నిర్లక్ష్యం జరగకుండా చూసుకోవాలని, తొలగింపులు, కొత్త ఓటర్ల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎల్‌ఏ), రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. మొత్తం జాబితాల పరిశీలన తర్వాత తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. నాయకులు యలమంచిలి సూర్యనారాయణ, మధునాయుడు, గంటా నూకరాజు, వాసుపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ పండగ



ముత్యాలమ్మ ప్రతిమలు ఆలయం వద్దకు తీసుకొస్తున్న భక్తులు

**పద్మనాభం:** మండలంలోని మద్ది గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గతంలో అమ్మవారి ప్రతిమగా వేప చెట్టును కొలిచి పూజలు నిర్వహించేవారు. కొత్తగా ఇత్తడితో తయారు చేసిన అమ్మవారి ప్రతిమను వేప చెట్టుకు ప్రతిష్ఠించారు. అమ్మవారి ఆలయం చుట్టూ రూ.3 లక్షల పంచాయతీ నిధులతో ప్రహరీ నిర్మించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆలయ ప్రాంగణంలో సొంత నిధులతో రేకుల షెడ్ నిర్మించారు. కనకల అప్పలరాజు సొంత నిధులతో టైల్స్ వేయించారు. ఈ సందర్భంగా పండగ నిర్వహించి అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా వేప చెట్టు వద్దకు తీసుకొచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ చెల్లించి పూజలు చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు తులసి లక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## రీ సర్వేపై అమనాంలో గ్రామసభ



అమనాం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

**తగరపువలస:** రైతుల భూములకు సంబంధించి జగనన్న భూ రక్ష రీ సర్వేపై మంగళవారం భీమిలి మండలం అమనాం పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. భీమిలి ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ పాల్గొని సర్వేపై రైతులకు అవగాహన కలిగించారు. రీ సర్వే ఎలా చేయాలి అన్న అంశంపై సిబ్బందికి అవగాహన కలిగించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మ్యుటేషన్, వారసత్వం, చనిపోయిన కేసులకు సంబంధించి గ్రామసభలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామకంఠంలో ఉన్న ఇళ్లను కూడా రీ సర్వే చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా స్కెచ్‌లు తయారు చేయనున్నట్టు తెలిపారు. బుధవారం నుంచి రీ సర్వే చేపట్టనున్నందున ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దంతులూరి ఉమాదేవి, రీ సర్వే డీటీ లక్ష్మి, వీఆర్వో అఖిల్, సర్వేయర్ సంధ్య, ఉప సర్పంచ్ చుక్క చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మూలకుద్దులో అసైన్డ్ భూముల రైతుల ఆందోళన

**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ రెవెన్యూ పాత మూలకుద్దులో సర్వే నంబర్ 28, 29లోని ఆరున్నర ఎకరాల బంజరు, అసైన్డ్ భూములకు సంబంధించి మంగళవారం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు జిరాయితీగా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఇక్కడి రైతులు గత నెల 24న భీమిలి తహసీల్దార్, 31న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఆ భూముల్లో ఫెన్సింగ్ వేస్తుండగా చిప్పాడకు చెందిన వైస్సార్‌సీపీ నాయకుడు వెంపాడ సూరిబాబు ఆధ్వర్యంలో వందలాది మంది మూలకుద్దు చేరుకుని పనులు నిలుపుదల చేయాలని అడ్డుకున్నారు. తాము ఈ అసైన్డ్ భూములను ఎవరికీ విక్రయించలేదని, ఈ స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి ఇవ్వనున్నట్టు తెలిపారు. దీంతో ఫెన్సింగ్ వేస్తున్న వ్యక్తి నిర్మాణ పనులు నిలిపివేశాడు. ఇరువర్గాలు భీమిలి రెవెన్యూ అధికారులు, పోలీసులను ఆశ్రయించారు.

## నవోదయ విద్యార్థిని ప్రతిభ



మణి దీపిక

**కొమ్మాది:** జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థిని రోకళ్ల మణిదీపిక మైసూర్ ప్రాంతీయ కళాశాల బీఎస్సీ, బీఈడీ సమీకృత శిక్షణ ప్రవేశ పరీక్షలో రాణించి భౌతికశాస్త్ర విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని, దేశంలో 14 స్థానాన్ని దక్కించుకుందని ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఈఆర్‌టీ ఈ పరీక్షను జాతీయ స్థాయిలో నిర్వహించింది. కొమ్మాది జవహర్ నవోదయలో గత సంవత్సరం నిర్వహించిన సీబీఎస్సీ పరీక్షలో కూడా 90 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మణిదీపికను ఉపాధ్యాయులు అభినందించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కొమ్మాది:** రుషికొండ శ్రీవారి ఆలయం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఇక్కడ ప్రధాన రహదారిపై ఉదయం నుంచి ఓ వ్యక్తి పడి ఉన్నారు. గమనించిన పలువురు దగ్గరకు వెళ్లి చూసి మృతి చెందినట్లు నిర్ధారించుకుని ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వయస్సు సుమారు 60 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

# మెటీరియల్ తరలించేందుకు ఇబ్బందులు

రోడ్డు అభివృద్ధి చేయాలంటున్న చిప్పాడ జగనన్న కాలనీ వాసులు



చిప్పాడ శివారు కొండపై జగనన్న లే అవుట్



దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పక్క నుంచి అభివృద్ధి చేయాల్సిన దారి



ఎన్టీఆర్ కాలనీలో రివర్స్‌లో బిగించిన బోరు హ్యాండిల్

**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ శివారు కొండ ప్రాంతంలో కేటాయించిన జగనన్న లే అవుట్‌కు మెటీరియల్ తరలించేందుకు పక్కా రహదారి ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. 2020 డిసెంబరులో ఈ జగనన్న లే అవుట్‌లో 326 మందికి స్థలాలు కేటాయిస్తూ అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. వాస్తవానికి జగనన్న లే అవుట్‌కు ఇతర ప్రాంతాల నుంచి మెటీరియల్ తరలించాలంటే చిన్న వాహనాలు లేదా ట్రాక్టర్లే వెళ్లగలుగుతాయి. ఎక్కువ మొత్తంలో ఇసుక, పిక్క, సిమెంట్ తదితర మెటీరియల్ తరలించడానికి సరైన రహదారులు లేవు. చిప్పాడ గ్రామం నుంచి భారీ వాహనాల ప్రవేశానికి అనువుగా లేకపోవడంతో పాత మూలకుద్దు ఆర్కే లే అవుట్ లోపలి నుంచి వెళ్లాల్సి వుంటోంది. కానీ ఈ లే అవుట్ దాటిన తర్వాత చిత్తడి నేలల కారణంగా వాహనాల రాకపోకలకు అనువుగా లేదు. రెండోది ఆశిపాలెం వద్ద ప్రైవేట్ లే అవుట్, ఎన్టీఆర్ కాలనీ, ఆశిపాలెం శివారు నుంచి కనకమ్మ గుడి మీదుగా లే అవుట్‌కు మార్గం ఉంది. అయితే ఎన్టీఆర్ కాలనీలో టీడీపీకి చెందిన వారు ఉద్దేశపూర్వకంగా భారీ వాహనాలు తిరగకుండా రోడ్డు కార్నర్‌లో ఉన్న బోరు బావి హ్యాండిల్ రివర్స్‌లో బిగించారు. దీంతో దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పక్క నుంచి, కొండవాలు నుంచి రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తే నేరుగా లే అవుట్ వరకు భారీ వాహనాలతో మెటీరియల్ తక్కువ ఖర్చుతో వెళ్లిపోతుందని లబ్ధిదారులు అంటున్నారు.

**ప్రైవేట్ లే అవుట్‌లో డంపింగ్...**


ప్రస్తుతం జగనన్న కాలనీకి నేరుగా సరైన మార్గం లేకపోవడం, ఉన్న మార్గంలో ఎన్టీఆర్ కాలనీలో టీడీపీ నాయకులు బోరు హ్యాండిల్ రివర్స్‌లో బిగించడంతో దివీస్ రోడ్డును ఆనుకుని ఆశిపాలెం ప్రైవేట్ లే అవుట్‌లో మెటీరియల్ డంప్ చేసుకోవాల్సి వస్తోంది.

దీంతో ఒక టిప్పర్ మెటీరియల్‌ను మూడు సార్లు ట్రాక్టర్‌తో తరలించడానికి ఖర్చులు మూడు రెట్లు అవుతున్నాయి. ఈ కష్టాల నుంచి తమను గట్టెక్కించడానికి ఎన్టీఆర్ కాలనీలో రివర్స్‌లో బిగించిన బోరుబావి హ్యాండిల్ మార్చడంతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పక్క నుంచి మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని చిప్పాడ జగనన్న కాలనీ లబ్ధిదారులు కోరుతున్నారు.

## నగరపాలెంలో వార్డులు మారిన ఓటర్లు

**తగరపువలస:** భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో ఖాళీ అయిన 10వ వార్డు సభ్యుని ఎన్నిక ఈ నెల 19న జరగనుంది. ఈ క్రమంలో ఇక్కడి ఓటర్ల జాబితాలో పేర్లు తారుమారయ్యాయి. గతంలో 10వ వార్డులో ఉన్న ఎస్సీ కాలనీ, గొల్లలపాలేనికి చెందిన సుమారు 120 ఓట్లు 8, 9వ వార్డుల్లో కనిపిస్తున్నాయి. అలాగే 8, 9వ వార్డులకు చెందిన ఓట్లు 10వ వార్డులో కనిపిస్తున్నాయి. ఇటీవల ఓటర్ల చేర్పులకు సంబంధించిన వాటిని వేరు జాబితాలో చూపించకుండా వార్డుల వారీగా కలపడంతో ఈ తారుమారు జరిగినట్టు పంచాయతీవాసులు అంటున్నారు. గత ఎన్నికల్లో 8, 9 వార్డు సభ్యులను ఎన్నుకున్నవారే ఇప్పుడు 10వ వార్డు సభ్యుడిని ఎన్నుకోవాల్సి వస్తోంది. దీనిపై ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

## వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** వెంకటాద్రిపై మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చాతుర్మాస్య పూజల్లో ఈ పూజలు చేశారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తు లకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



జాతీయ జెండాతో ర్యాలీలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

**ఆనందపురం :** విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు లెంక రాంబాబు అన్నారు. మండలంలోని శొంఠ్యాం గ్రామంలో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 250 మీటర్ల జాతీయ జెండాతో అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశం అన్ని రంగాల్లో ముందుండేటట్టు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బొద్దపు బంగార్రాజు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్, హెచ్‌ఎం ఎ.జోగారావు, మేము సైతం సొసైటీ అధ్యక్షుడు అక్కిరెడ్డి దేముడు, కట్టమూరి బాలభాను తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

**మధురవాడ:** కార్మికులు, ప్రజలు హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలు చేయక తప్పని పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. మధురవాడ మార్కెట్ నుంచి జీవీఎంసీ ఆఫీసు వరకు ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రజలు నిరసన తెలియజేసినా ప్రభుత్వాలు ఓర్వలేకపోతున్నాయని, ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు నష్టం కలిగించే విధానాలు అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సంపదతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్మేస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మాలన్న ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంవీ ప్రసాద్, సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, రాములప్పడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**మధురవాడ:** ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చంద్రంపాలెం, వుడా కాలనీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ సబ్ స్టేషన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామ్మూర్తి చెప్పారు.

ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్డు, దుర్గానగర్, కళానగర్, ఎన్‌జీజీవోస్ లే అవుట్, వాంబేకాలనీ, కృష్ణానగర్, ద్రోణంరాజు కల్యాణ మండపం ఏరియా, చంద్రంపాలెం, పోర్టు కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ, సుద్దగెడ్డ ఏరియా, వాంబేకాలనీ, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94408 12525లో సంప్రదించాలని కోరారు.

- కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలోని సేవానగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈఈ వై.సురేష్ కుమార్ తెలిపారు.

## చంద్రంపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు



చంద్రంపాలెంలో పర్యటిస్తున్న నాయకులు

**మధురవాడ:** జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో బుధవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు చెప్పారు. ఇందులో పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వార్డులో 13 సచివాలయాలు ఉండగా ఇప్పటికే 12 సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని నివాసాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు చొప్పున విడుదల చేయడంతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు గ్రామంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి శానిటేషన్, తాగు నీటి సదుపాయాలపై ఆరా తీశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, పిళ్లా సూరిబాబు, జగ్గపిల్లి నరేష్ పాల్గొన్నారు.

## పంచాయతీ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల



షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎంపీడీవో లవరాజు

**ఆనందపురం :** మండలంలోని వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఎంపీడీవో, సహాయక ఎన్నికల అధికారి అడపా లవరాజు మంగళవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. వెల్లంకి పంచాయతీలో 6, 12 వార్డులు, కణమాం పంచాయతీలో 3వ వార్డు, పాలవలసలో 1వ వార్డు స్థానాలు వివిధ కారణాలతో ఖాళీ అయ్యాయి. ఈ మేరకు ఆయా స్థానాల్లో ఎన్నిక నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యంతరాలను 12న భీమిలి ఆర్డీవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవచ్చు. 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. పోటీలో అభ్యర్థులు ఉంటే ఈ నెల 19న ఎన్నిక నిర్వహించి అదే రోజు కౌంటింగ్ చేస్తారు.

## బోనిలో 90 శాతం వరి నాట్లు పూర్తి



బోని పొలంలో వేసిన వరినాట్లు

**ఆనందపురం :** మండలంలోని బోని గ్రామంలో 90 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. ఖరీఫ్ సీజను ప్రారంభమైన చాలా గ్రామాల్లో ఇంకా అంతా వరి నారుమడులు దశలోనే ఉన్నాయి. కాగా ముందస్తు వర్షాలు కురవడంతో 1300 ఎకరాల్లో విస్తరించి ఉన్న బోని ముకుందరాజు చెరువులో నీరు పుష్కలంగా చేరింది. దీంతో అక్కడ రైతులు అందరి కంటే ముందుగానే వరి నారు మడులను సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ 450 ఎకరాల ఆయకట్టు ఉండగా 400 ఎకరాల్లో నాట్లు వేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన 1121, సోనామసూరి, సాంబామసూరి రకాలను రైతులు సాగు చేస్తున్నారు.

## ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలి

**కూర్మన్నపాలెం:** కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనివల్ల అమాయకులైన కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 908వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.